# మన ధర్మము - కర్తవ్యము

## శ్రీ సాయిమాష్టార్ ప్రవచనం



ప్రతులకు : పెసల సుబ్బరామయ్య
గొలగమూడి
నెల్లూరు జిల్లా - 524321

మన ధర్మము - కర్తవ్యము

శ్రీ సాయిమాష్టార్ ప్రవచనం

సర్వస్వామ్యములు - సాయి మాష్టర్ సేవాట్రస్ట్ వారివి.

5000 కాపీలు

కాపీల కొరకు:

శ్రీ సాయిమాష్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (PO)
నెల్లూరు జిల్లా - 524 321

ఓం సాయిమాష్టార్

# మన ధర్మము - కర్తవ్యము

## శ్రీ ఆచార్య భరద్వాజ మాస్టారు చెప్పిన ప్రవచనం

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరుగుచున్న ఈ పవిత్రమైన కార్యక్రమములో పాల్గొనే అదృష్టాన్ని కల్గించిన కార్యకర్తలందరికి మొదట కృతజ్ఞతలు తెలుపుతూ, మన కర్తవ్యాన్ని గురించి, మనధర్మం గురించి ఒకటి రెండు విషయాలు మీతో పంచుకుంటాను. భగవద్గీతలో "యధాయధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతా" అంటూ ఎపుడెపుడయితే ధర్మానికి హాని కలుగుతుందో, దానిని ఉద్ధరించడానికి మళ్ళీమళ్ళీ అవతరిస్తుంటానని హామీ ఇచ్చారు. ఆయన అవతరించడం అనే హామీ సంగతి ఎట్లావున్నా మొదట ధర్మగ్లాని కల్గడం మాత్రం ప్రత్యక్షంగా మనం చూస్తూవున్నాం. ఇది ప్రకృతిలో వస్తున్న ఒకానొక అనివార్యమార్పుగా మనకు చిన్న విషయం దగ్గర నుంచి పెద్ద విషయం వరకు ప్రాక్టికల్‌గా కనిపిస్తుంది. వ్యక్తి యొక్క జీవితం చూచినట్లయితే శక్తి వికాసాలతో కూడినటువంటి యవ్వనం అయిపోయి, ఒకానొక నాటికి వార్ధక్యం వచ్చి, శరీరానికి, మనస్సుకు వుండే సామర్థ్యాలు కుంటుపడటం ప్రారంభించటం మనిషి జీవితంలో చూస్తున్నాం. అట్లాగే వృక్షాలను చూచినట్లయితే చక్కగా చెట్లు ఏపుగా ఎదిగి నిండుగా



పువ్వులతో, ఆకులతో, పండ్లతో వుండే దశ అయిపోయి ఆకులు రాలేటటు వంటి కాలం, పూయకుండా ఉండి మోడుబారే కాలం రావడం మన ప్రకృతిలో చూస్తున్నాం. అట్లాగే మన "హిందూ ధర్మానికి" కూడా 'వృద్ధాప్యం' అనేటటువంటి దశవచ్చిన చిహ్నాలు ఇప్పుడు మనకు కనపడుతున్నాయి. వృద్ధాప్యం వచ్చినపుడు మరణభీతి కల్గుతుంది మనిషికి. యవ్వనంలో ఉండేటపుడు మనిషికి ఏమనిపిస్తుందంటే ప్రపంచంలో ఎవ్వరైనా చస్తే చావచ్చుగాని, ఒకనాటికి తను చస్తానన్న ఆలోచన రాకపోవడమే యవ్వనమంటే. వృద్ధాప్యం అంటే అందరు బ్రతికితే బ్రతకవచ్చు గాని, మనం మాత్రం చావడం తధ్యం అనే భయం రావడం అది వృద్ధాప్య లక్షణం. అటువంటి దశ మన ధర్మానికి రావడం మనం చూస్తున్నాం. ఎక్కడెక్కడ ధర్మోపన్యాసం మన ధర్మం తెలుసు కోవడానికి మనలను ఉత్తేజపరచుకోవడం కోసం ధర్మోపన్యాసం పెట్టుకున్నా రెండు జరగడం చూస్తున్నాం మామూలుగా. ఒకటి మన వేదాలలోను, ఉపనిషత్‌లలోను ఫలానా ఋషులు ఇలా చెప్పారు. అలా చెప్పిన వాటిని నేటి శాస్త్రజ్ఞులు మరల మరల తిరిగి ఇలా కనుక్కుంటున్నారు. ఈనాడు, టెలివిజన్ అనే పరికరాలతో చేసిన దానిని మనవాళ్ళు కళ్ళుమూసుకుని కనుక్కోనేవారు. పరమాణువులు అన్నీ నేటి శాస్త్రజ్ఞులు చెప్పే వాటిని మన శాంఖ్యులు, వైదేషుకులు చెప్పారు. కాబట్టి మన ఋషులు ఎంత గొప్పవారు అని చెప్పుకుని చంకలు గుద్దుకుని సంతోషించడం వంటి ఒక బలహీనత కనబడుతుంది. శక్తి ఉడిగిన వాడు ఏమిచేస్తాడంటే ఇప్పుడు నడిచేందుకు ఓపిక లేకపోయినా, ఒరేయ్! మేము చిన్నతనంలో ఉండేటపుడు ఎలా

ఉండేవాళ్ళు మనుకున్నావ్? ఎగిరి 12 అడుగుల గోడ దూకే వాళ్ళం. 3 దఫాల ఆహారం ఒకేసారి తినేసేవాళ్ళం. అయితే! ఎవరికి ఉద్ధరణ? నీకు ఎందుకు పనికి వస్తుంది? నాకు ఎందుకు పనికి వస్తుంది? ఆనాడు ఆయనకు ఎంత శక్తి వుంటే మాత్రం. అంటే ఇప్పటి అసమర్ధతను కప్పిపుచ్చుకుంటానికి, వెనుకటి సామర్ధ్యాలను గుర్తుంచుకుని చంకలెగరేసుకోవడమా! మా తాతగారో, మా ముత్తాతగారో ఎవరో మహామేధావి కావచ్చు. దానివల్ల నాకేమిటి వచ్చింది? 'నేనేమిటి' అనేదాని మీద నా విలువ ఉంది. అంతేగాని మాతాతగారో, మా ముత్తాతగారో మహాపండితులైనంత మాత్రాన నేను పండిత కుపుత్రుణ్ణి కాకుండా చూచుకునే ఆవశ్యకత నాకుంటుంది. కాబట్టి వెనుకటి ఋషులు ఎంతటి గొప్పవారైనా అయిఉండవచ్చుగాని, మన మెవరం? ఏమిటి? మనం తగుదుమా లేమా! వారి పేరు చెడగొట్టడం కోసం పుట్టామా, వృద్ధిచెందించడం కోసం పుట్టామా? అనే సంగతి మనం ఒకసారి చూచుకోవాలి. అది మన ధర్మనిర్వహణలో ఒక పెద్దలోపంగా కనపడుతుంది. మనవాళ్ళు మంత్రశక్తి, యోగశక్తి గురించి గ్రంధాల్లో వ్రాశారు. ఇవన్నీ కూడా ఆధునిక మైనటువంటి, విజ్ఞానమైనటువంటి యుగంలో పాశ్చాత్య దేశాలలో, పాశ్చాత్య విద్యాప్రభావం వలన మన వాళ్ళు ఏమి నమ్మలేకుండా వున్నారు. అట్లా కాదు వేరే దేశాలలో వాళ్ళు ప్రయోగాలు జరుపుతున్నారు. వాటిలో అలా చూస్తూ చూస్తూ ఆ వస్తువును పైకి లేపేయగలరు ఏమనుకున్నారో, మన యోగశాస్త్రంలో చెప్పింది నిజమే అన్నారు. నీవేమైనా చేసిచూపిస్తావా? రెండు రోజులు కూర్చోని వరుసగా



ధ్యానం చెయ్యగలవా? వాడెవడో కనుక్కుంటే నీకేమి వచ్చింది? వాళ్ళు కనుక్కోకపోతే నీకు నాకు పోయిందేమిటి? అందుకని దీనిని మెట్టవేదాంతమంటామన్నమాట. ఆకుపచ్చగా ఉండవలసి నటువంటి ఆకులలో పసుపచ్చదనం బదులు ఎఱ్ఱదనం కనపడుతుంటే అటువంటి జాడ్యం మన ధర్మంలో ఈ రెండంశాల రూపంలో కనబడుతుంది. స్వచ్ఛమైనటువంటి యువకుడు తాను కార్యశీలుడై దానిని చీల్చి చెండాడి సాధించి పొందాలని చూస్తాడు. కాని వెనుకెవరో చేసినది వల్లెవేసుకుని ఇప్పుడున్న అసమర్ధతను కప్పిపుచ్చుకోవాలనికోడు. తన పెద్దలెవరో సాధించినటువంటి గొప్పదనాన్ని చూపించి తన పనికిమాలినతనాన్ని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నించడు. అట్లాకాక పోగా వెనుకటి వాళ్ళు ఏమీ సాధించకపోయినాసరే వాళ్ళందరిని కూడ తీర్చిదిద్దేటటువంటిది, తను సాధించటం కోసం ప్రయత్నం చేసేవాడు మనిషి, వాడు సమర్ధుడు. అందుకని ఇప్పుడు మనం ఆలోచించాల్సినటువంటి కర్తవ్యం కృష్ణపరమాత్మ అందుకే చాలా అద్భుతరీతిన మనకు తెలియచెప్పాడు. ఆ ధర్మాన్ని మనం స్మరించవలసినటువంటి ఆవశ్యకత ఉన్నది. యుద్ధరంగంలో నిల్చుని అర్జునుడు వీరందరినీ చంపడం ఎట్లా? చంపక పోవడం ఎట్లా ఇది ధర్మమా? అది ధర్మమా? అని అడిగితే ఒరేయ్! నీ పూర్వ ఋణానుబంధము వలన వీరందర్ని చంపాల్సివచ్చిందని సమాధానం చెప్పలేదు. ఇది ప్రారబ్ధమా! ఆగామా? సంచితమా? అని చెప్పలేదు. మెట్ట వేదాంతం చెప్ప బోతారేమోనని "చేసేది ధర్మమా, కాదా? కాబట్టి చేయండి, చేసేటప్పుడు మనసు ఎలా

ఉంచుకుంటే ఉత్తమమైన ఫలితం వస్తుందో అట్లా వుంచుకుని నీ పని నీవు చేయ్" అంతేగాని అంతకంటే మెట్ట వేదాంతపు మాటలు మాట్లాడలేదు. లేదా శుభమూహూర్తం పెట్టుకుని యుద్ధం ప్రారంభించు! నీవు జయిస్తావు, అని సలహా ఇవ్వలేదు. యుద్ధంలో జయించావా నీకు రాజ్యం వస్తుంది. ధర్మం కోసం యుద్ధం చేసినటువంటి మంచి దక్కుతుంది. ధర్మం కోసం యుద్ధం చేయడంలో ప్రాణాలు కోల్పోతావా ముక్తి వస్తుంది. ఉత్తమమైన విషయం కోసం ప్రాణం త్యాగం చేసిన ఖ్యాతి నీకు దక్కుతుంది, అని చెప్పాడు తప్ప మంచి మూహూర్తం పెట్టుకుపోరా! అని చెప్పలేదు. అందుకని ఎపుడయితే మన కర్తవ్యాన్ని విస్మరింపచేసేటటువంటి తక్కిన తాత్వికమైన విషాయాలు అనవసరమైనవి మన ధర్మంలో ప్రవేశించాయో, అపుడు చెట్టుకు ఉపయోగపడనటువంటి పండి పోయిన ఆకులు ఎక్కువయ్యాయన్నమాట. అందుకని వాటినన్నిటిని మనం తీసి సడలించి అవతల పారేయాలి. ఈరోజు, ఈక్షణంలో మీకు నాకు రూపాయి, అణా పైసలతో లెక్కకడితే ఎంత విలువ అని చూసుకోవలసిన సమయం వచ్చింది. మన ధర్మానికి ఏమన్నా విలువ ఉంటే దానిననుసరించి బ్రతుకుతున్న మీ విలువెంత? నా విలువెంత? మీకెంత తెలుసు? నాకెంత తెలుసు? దేసి ప్రకారం జీవించగల్గుచున్నాము? మన కర్తవ్యం ఏమి చెయ్యకలుగుచున్నాము అని ఆలోచించటం వల్ల మనకు నయాపైసా ఎత్తయిన విలువ ఉంటానికి అవకాశం ఉందికాని తక్కిన విషయం అంతా మాట్లాడటం వలన కరెంటు ఖర్చు దండగ. అటువంటి బలహీనతలనుండి మనము ఎప్పుడయితే



మేల్కోవటానికి తగినటువంటి కార్యక్రమాన్ని చేసుకుంటానికి మొదలు పెడ్తామో నాటినుండి కూడ నిజమైన కార్యక్రమము చేసిన వాళ్ళమవుతామని చెప్పి కార్యకర్తలకు ఒకసారి నా హృదయపూర్వకమైన విజ్ఞప్తి చేసుకుంటూ, అటువంటి క్రమబద్ధమైనటువంటి కార్యక్రమములను ఎన్నెన్నో చేపట్టవలసి నటువంటి ఆవశ్యకత ఉన్నది. మన జీవితాన్ని సార్ధకం చేసుకుంటానికి ఇప్పుడు మనం సమర్ధులం. ఈ క్షణంలో రేపొద్దుట్నుంచి మనం సమర్ధులం కావడానికి ఏం చేయడానికి అవకాశం ఉన్నది. ఏం చేయాలి అని తెలుసుకోవలసి ఉన్నది. అది చేసేది మాత్రమే మనకు ప్రస్తుతం. తక్కినవి మొత్తం అప్రస్తుతం అని కృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పినది తప్ప తక్కిన ఏ విషయాలూ మనం తీసుకురాకూడదు. "మన కర్తవ్యాన్ని చేయాలి, అది ఎందుకు ధర్మమో తెలుసుకోవాలి. అలా చేసేటప్పుడు మన మనోభావాలు ఎలా ఉండాలో తెలియాలి. అపుడు మనం చేయవలసిన కర్తవ్యాన్ని సుఖదు:ఖాలతో సంబంధం లేకుండా చేయాలి. తక్కినదంతా దౌర్బల్యం" అన్నారు. లేకపోతే అవకాశం వస్తే అర్జునుడు ఉపన్యాసం కొట్టాడు కృష్ణునికి, ఏమని "అయ్యో వీరందరు చచ్చిపోతే, మహావీరులందరు చనిపోతే, నేడు ధర్మాన్ని ఆచరించేవారందరూ లేకుండాపోతే అధర్మం ఎక్కువయిపోతే దానికి మనం కారకులం అయిపోతే అని పెద్ద ఉపన్యాసం దంచాడు. ఏడి శావులేవోయ్, చేయాల్సింది చేయవోయ్" అని కృష్ణపరమాత్మ చెప్పినది. అటువంటి కార్యశీలత మళ్ళీ మనకు వచ్చేందుకు మనం ఏమన్నా చేయకల్గితే, యిలా కలుసుకుని సమావేశం చేయటంలో సార్దకత

లేకపోతే మీ సమయం, నా సమయం, అందరి సమయం దండగ. ఎందుకంటే మూడు నాలుగువందల మందిమి ఇక్కడ సమావేశమయితే ఒక్క రెండు నిమిషాలు వృధాఅయితే 300 మంది మీద 600 నిమిషాలు దండగ అవుతాయి. అంటే 10 గంటలు శ్రమ దండగ అవుతుంది. 300 మంది చేయకల్గిన కార్యక్రమం దండగ అవుతుంది. సగటున కలిపి చూస్తే 600 నిమిషాలు వృధాఅయి తిరిగిరావు. అందుకని ఈ కొద్ది సమయంలో మీ ముందు నేను ఉంచబోయేటటువంటి ఒకటి రెండు విషయాలు మాత్రం చెపుతాను. ధర్మంలో మహత్తర మయినటువంటి విషయాలు ఏమిటంటే మనిషికి ఏమి అవసరమో ఒక ఉదాహరణ ఉన్నది. బుద్ధుడుని అడిగారు, ఏమయ్యా ఇపుడు వీరు కష్టాలు పడుతున్నారు కదా, దు:ఖ పడుతున్నారు కదా! దీనికి ఆగామి కారణమంటావా, సంచితము కారణమంటావా, ప్రారబ్దం కారణమంటావా? అన్నారు. బుద్ధుడు అన్నాడు ఏడుశావులే అని. బాణం వేశాడు శత్రువు, అది బాగాలోతుగా గుచ్చుకుని విపరీతమైన నొప్పి పుడుతుంది. కొద్ది క్షణాలలో దాన్ని తీయకపోతే చచ్చిపోతాడువాడు. అపుడు ఏడ్చినవాడు ఎలాగున్నాడు. వాడికి అన్నదమ్ములెంతమంది? వాడిపేరు ఏమిటి? వాడు ఎంత పొడుగున్నాడు? అని పరిశీలన చేస్తావా? లేక ఆ బాణాన్ని తీసివేసి బ్రతికించుకోవడానికి ఏమయినా ప్రయత్నం చేస్తావా? అందుకని ఇక్కడ దు:-నివృత్తికి ఏం చేయాలో అది చేసుకో. తక్కిన విషయాలు మెట్ట వేదాంతం క్రింద తీసి అవతలపారేయమన్నాడు. అది ఆదృష్టిని మనం మళ్ళీ తిరిగి పొందడమా అనే విషయం వచ్చేటప్పటికి ఒక్కటే



మనకు ప్రస్తుతమైన విషయం. మనిషికి ఏం కావాలి? దానిని పొందడంలో మనమెంత సమర్థులం. ప్రకృతి మనకు శరీరాన్ని ఇచ్చింది. ఆరోగ్యంగా, పుష్టికరంగా మనం చేయవలసినటువంటి కర్తవ్యాన్ని చేయడానికి కావలసిన ఆరోగ్యం శరీర ధారుఢ్యం మనకు ఉన్నాయా? అన్నది ఒక ప్రశ్న. ఆ! ఉన్నాయండీ అంటే నీకున్నదాంట్లో నాల్గవ వంతు పెట్టయినా పనికి వచ్చే పని ఏమైనా చేస్తున్నావా? రెండవ ప్రశ్న. ఎందుకంటే ధనం ఉండి తినలేక పోవడం ఒక దరిద్రం, లేకుండా తినలేకపోవడం కంటే. ఆరోగ్యం లేక ఏమి చేయలేకపోవడం కంటే పుష్టికరమైన ఆరోగ్యం ఉండి ఏమిచేయ్యకుండా వుండడం అనేది బ్రతికి ఉండగానే మరణానికి surrender కాగితం మీద సంతకం పెట్టిచ్చినట్లన్నమాట. ఎప్పుడోకప్పుడు మృత్యువు వచ్చి నన్ను తీసుకుపోతుంది సరే! బతికి ఉండగానే, మన శరీర సామర్థ్యాలన్నీ Stamp పేపరుమీద రాసి తనచేతికిచ్చి నమస్కారం చేసి జీవచ్ఛవంగా బ్రతుకుతున్నట్లు అవుతుందన్న మాట. అందుకని శరీరధారుఢ్యం ఉండేలాగ చూచుకోవటం ఒకభాగం. ఉన్నకొద్ది శరీరధారుఢ్యంతోనైనా సరే ఎంత సాధించ కలిగావు అనేది యుక్తి. మన దగ్గర పిడికెడు ధాన్యం ఉంటే ఉండవచ్చుగాక. దీన్ని మళ్ళీ తిరిగి పెంపొందించటం చేశావా! లేక బస్తాలు బస్తాలుగా ఉంటే అదంతా మలంగా మార్చటం మాత్రమే చేశావా? అన్నది ప్రశ్న. ఎందుకంటే ఏం చేసినా, ఏం చేయకపోయినా ఆహారం తినాలి. తిన్నదానికి ఏమిచేస్తున్నా మన్న ప్రశ్న మనకు మనసులో ఉత్పన్నమయితే మనకు అసలు ధర్మం గురించి మాట్లాడటానికి అవకాశమున్నది. అన్నిటికంటే

ప్రధానమైనది ధర్మము. మనిషికి కావలసినది నాలుగు. ధర్మము, అర్ధము, కామము, మోక్షము. అందులో ధర్మము అనే దానిని ప్రధానంగా చెప్తారు. ధర్మమంటే ఏమిటి? అబద్ధం చెప్పకుండా ఉండడమా, ఒకరికి చెడుచెయ్యకుండా ఉండడమా? ఎవడో అన్నడట. మావాడు ఏ పాపం ఎరుగడండీ! ఎవరిని కష్టపెట్టడండి. ఏడిశాడు! ఎప్పుడన్నా ఏ పుణ్యం అన్నా ఎరుగునా? ఎవడినన్నా సు-పెట్టాడా అన్నది ప్రశ్న గాని, ఎవడికి ఏ కష్టం కల్గించకుండా ఉండడం శవం కూడా చేస్తుంది. ఏ పాపం చేయకుండా ఉండటం కూడా బల్ల, రాయి కూడా చేస్తాయి. అందుకని అవి ఉపయోగకరమైన పనులు కావు. ధర్మానికి ప్రధానమైన లక్షణములేమిటంటే కాస్త పరుషంగా చెప్తాను, ఏమనుకోకండి. మనం ఎంత తెలివిగలవారమైనా, ఎంత దనార్జులమైనా, కీర్తి సంపన్నులమైనా మనం ఎంత గొప్పవారమని ఎంతమంది అనుకున్నా ప్రకృతి అంతా కూడా చందాలు వేసి, విరాళాలు వేసికుని మనలను బ్రతికిస్తుంది. అది మనం గమనించుకుంటే అహంకరించటానికి ఎవరికి ఏ మాత్రం ఆధారం ఉండదు. అంటే నా ఉద్దేశ్యమేమంటే వృక్షాలు ఉన్నాయి. వృక్షాలకు బీజం ఉన్నది. ఫలాలు ఉన్నాయి. దాని యొక్క లక్ష్యం ఏమిటని ఆలోచిస్తే చెట్టుకు ఫలం ఉండటం ఆ ఫలంలోపల విత్తనాలు ఉండటం. దానికి ఒక్కటే ప్రయోజన మున్నది. తిరిగి మళ్ళీ ఆ వృక్షజాతి వృద్ధిపొందటం. ఒక మామిడి చెట్టున్నదంటే ఆ చెట్టుకు ఒక కాయ కాస్తే అది పండితే ఆ టెంకలోంచి మళ్ళీ పాతికో, ముప్పైయో, వందో మామిడి చెట్లు రావడానికి కావలసినటువంటి ఏర్పాటు. అంటే దాని జాతి



నశించకుండా ఉండటానికి భగవంతుడు లేక ప్రకృతి పెట్టినటువంటి ఒక సూత్రం. అయినపుడు ఎట్లా చేసిందంటే ఈ ప్రకృతి వైచిత్రి, సృష్టి వైచిత్రి ఆ మామిడి టెంక పైన ఉండే గుజ్జు మనకు, కోతులకు మొదలైన వాటికి రుచికరంగా ఉపయోగపడేలా చేసింది. అందులో ఉండే రసం ఎపుడయితే తీసుకుంటామో ఆ వృక్షాలు మరలా మరలా మనకు కావాలి అని అనిపిస్తుంది. కాబట్టి ఆ టెంకలను నాటుకుంటూ మనం మామిడితోటను పెంచుకుంటాం. ఇలాగే మన ఫలవృక్షాలు, కూరగాయల చెట్లు ఇవన్నీ అంతే. అలాగే మనకు ఆహారాన్ని ఇచ్చే చెట్లన్నీ. కాని ఒక్క విషయం ఆలోచించాల్సిందే. ఏమిటంటే ఆ వృక్షజాతి నశించకపోవటం ఒక్కటే దాని యొక్క లక్ష్యం గనుక అయితే ఒక చెట్టుకు ఒక ఫలం చాలు, లేకపోతే రెండు ఫలాలు చాలు మరల రెండు చెట్లు రావడానికి. కాని అట్లాగే కాసినట్లయితే మళ్ళీ ఎవడు తిరిగి మామిడి చెట్లను నాటరు. ఇంత కష్టపడిచేస్తే రెండు కాయలు ఇస్తే ఎవడూ తోటను పెంచడు. అట్లాగే ధాన్యపు మొక్కలు ఒక్కగింజ ఇచ్చినట్లయితే మనం గడ్డి తినడం మొదలు పెట్టాలి. పశువులు కర్మకాలిపోతుంది. అందుకని సృష్టి వైచిత్రి ఎలా చేసిందంటే ఆ చెట్లకు ఒకటి రెండు పండ్లు కాకుండా, మనుషులు, కోతులు ఇతర జీవరాశులు తృప్తిగా సంతోషించడానికి, క్రిమికీటకాదులు వాటిమీద జీవించడానికి ఇలా ఎన్నో రకాల ఏర్పాటు చేసాడు భగవంతుడు. అంటే ఆ వృక్షం యొక్క ఫలం ఆ వృక్షానికి మాత్రమే గాక చుట్టూ ఎన్నో జీవరాశులకు పనికి వచ్చేటట్లు చేశాడు. ఆ చెట్టు క్రిందకు నీడ కోసం వచ్చిన వారుంటారు.

ఆ చెట్టుపై గూడు కట్టుకునే పక్షులు ఉంటాయి. వాటి తొర్రలలో పురుగులు ఉంటాయి. వాటి పిందెలను తినే పురుగులు ఉంటాయి. కోతులు ఉంటాయి. మనుషులు ఉంటారు. ఇన్ని జీవరాశులకు పనికి వస్తు నా బ్రతుక్కి ఇంత సార్ధకత ఉంది, నన్ను తినే నీ బ్రతుక్కి సార్ధకత ఎంత? అని మనం తినే మామిడిపండు తిరిగి అడుగుతుంది. అట్లాగే నోట్లోకి వెళ్ళే ప్రతి ధాన్యపు గింజ అడుగుతుంది. వృక్షాలను బ్రతికించుకోవడానికి అయితే నేనొక్కతిని చాలు. కాని నీవు ఒక్క ధాన్యపు గింజ నాటితే నీకు కడివెడు ధాన్యపు గింజలను తిరిగి ఇస్తున్నాను. అవి తిన్నందుకు నీవు చేస్తున్నపని ఏమిటని అడుగుతున్నాయి. అట్లా అవి అన్నీ చందాలు వేసుకుని మనను బ్రతికిస్తున్నాయి. పశువులు ఆ దూడలకు సరిపోయే పాలు మాత్రమే ఇచ్చేటట్లయితే ఎవరూ పశువులను, పాడి పంటలను కలిగి ఉండే అవకాశం లేదు. ఉత్తర హిందూస్థానంలో చూస్తే ఒకానొకప్పుడు ఇక్కడకూడ ఎట్లా ఉండేదో మనం ఊహించవచ్చు. మనం చూస్తుండగానే నాలుగైదు బకెట్లు పాలు తీస్తారు. అంటే దాని దూడకు సరిపోయేటటువంటి పాలను మాత్రమే కాకుండా మనకు కూడ సమృద్ధిగా సరిపోయే పాలను దానికి ఇచ్చేటటువంటి వ్యవస్థను ప్రకృతి లేక భగవంతుడు ఏర్పాటు చేశాడు. అట్లాకాక తమ దూడలకు మాత్రమే పాలిచ్చేటట్లయితే మనం మేతను మేపం. మనమే మెయ్యచ్చుగా! వాటికోసం ఆకాశం కేసి చూసే - ర్మ మనకేమి పని. కావాలంటే నాలుగు కాళ్ళమీద నడుస్తాం అంతేకదా! ఒకసారి ఒక కళాశాలలో పనిచేస్తుంటే ఎన్నికల ప్రచారం కోసం మమ్మల్ని పనిచేయమన్నారు. నేను చెయ్యనండీ



అని చెప్పాను. ఏమయ్యా నీకు నచ్చిన వాడికి చెయ్యవచ్చుగదా అని అడిగారు. నల్గురు దొంగలలో ఎవరిని ఎన్నుకోమంటారు అని అడిగాను. కాని నేను అలా ప్రచారం చేయలేదని వారికి నామీద కోపం. వారు ఒక రాజకీయనాయకుడిని తీసుకువచ్చారు. మమ్మల్నందరినీ వరసలో నించోపెట్టారు పూలమాలలు వేయడానికి. నేను చెప్పాను నా ఖర్మకాల! ఒకసారి శిరిడిలో నా చేతులతో వేశానండి. నేను వెయ్యనండి అని చెప్పాను. అపుడు వారు వచ్చేసరికి ఏం జరిగిందంటే ఆ కళాశాల కొంచెం గ్రామ పరిసరాల్లాగ ఉంటుంది. గేట్లు పడిపోయాయి. అందులోనికి పశువులు వచ్చి మేస్తుంటాయి. అందుకని వాళ్ళు (రాజకీయ నాయకులు) వస్తారు కనుక గబగబ వాటిని బయటకు వెళ్ళగొట్టండోయ్ అన్నారు ఒకరు. ఒక ప్రక్కనుండి వాటిని మళ్ళిస్తున్నారు. అవి పోవడం చూస్తూఉంటే చటుక్కున మనస్సులో ఒక ఆలోచన మెదిలింది. నవ్వు వచ్చింది. నిజానికి జరిగింది ఏమిటంటే ఎంత కష్టపడి ఆదరా బాదరాగా చేస్తున్నారో వాటికేమైనా తెలుసా? ఆ వస్తున్న వాడెవడో, వాడి గొప్ప ఏమిటో, వాడి తత్వం ఏమిటో? ఆకలేస్తున్నది; తింటానికి గడ్డి ఉన్నది. హాయిగా పనికి వచ్చే పని చేస్తున్నాయి. మనకేమన్నా పనికివచ్చే పని చేస్తున్నామా? ఇందులో ఎవరు తెలివైనవారో? నాకర్ధం కాలేదు, అనుకుని నేను నవ్వుతూ ఉన్నప్పుడు మా కళశాలలో పనిచేసే ఒకడు ఏమిటయ్యా నవ్వుతున్నావు అన్నాడు. వాడడిగిన తీరుకు నా మనస్సుకు చివుక్కుమని, నా స్వభావం అటువంటిది కనుక, వెంటనే ఏం చెప్పానంటే ఇచ్చుట ధర్మం నాలుగు కాళ్ళమీద నడుస్తుంది అన్నాను. వాళ్ళకేమి అర్ధమైందంటే

ఇక్కడ ఉన్న మనుషుల రూపంలో ధర్మం లేదు. పశువుల రూపంలో మాత్రమే ధర్మం ఉంది అని అర్థమైంది. అదే నేను చెప్పింది. ధర్మం నాలుగు కాళ్ళమీద నడవడమంటే ఎందుకంటే వాటికి ధర్మం తెలుసు చక్కగా పనిచేస్తున్నాయి, సమృద్ధిగా పాలిస్తున్నాయి. మనం ఏమి చేస్తున్నాం అనేది తిరిగి ఆలోచించుకోవాల్సింది. అట్లా సృష్టి అంతా ప్రతి జీవి అనేక జీవులకు ఉపయోగపడేటట్లు భగవంతుడు సృష్టి చేస్తే, తాను మాత్రం ఎవరికీ దేనికీ ఉపయోగపడే అవకాశం లేకుండా తాను సంతోషిస్తూ తను సు-పడుతూ ఆ సు-ం కోసం ఎవరినైనా ఎన్ని విధాలుగానైనా ఏడిపిస్తూ బ్రతకడానికి మనకు ఏమి అర్హత ఉన్నది? దీన్నే కృష్ణపరమాత్మ ఏమని చెప్పాడంటే ఇది అంతా యజ్ఞం. యజ్ఞం అంటే ఏమిటి? అందరు దేవతలు కలిసి చేసినటువంటి సృష్టి మొదటి యజ్ఞం. అట్లాగే ఈ సృష్టిలో ఉన్నటువంటి అన్ని జీవరాశులు కూడా ఇతర ప్రతిదాని యొక్క జీవితం మీద ఆధారపడి జీవించేరీతిన నిర్మింపబడి ఉంది. ఆ వ్యవస్థ పేరు యజ్ఞం. అది తెలిసి అందులో మనము పాల్గొన్నప్పుడు, మనం తిన్నది "యజ్ఞహవిస్సు" అంటే నోట్లోకి అన్నం ముద్ద వెళ్ళేటప్పుడు, మనం సాటి జీవులకు ఏమి చేస్తున్నాము అని ఆలోచించుకోగలిగితే అపుడు మనం మనుష్యులం. నిజంగా వివేకంతో రెండు కాళ్ళమీద నడుస్తామని అర్థం. లేకపోతే భర్తృహరి సుభాషితులలో చెప్పినట్లు "మనుష్యరూపేణామృగాచరమితి" అన్నారు. కాకపోతే వీరికి కొమ్ములు, తోకలు లేవు. రెండు కాళ్ళమీద నడుస్తున్న పశువులు, అంతకంటే ఏం తేడా లేదు అన్నారు. అంటే ధర్మం ప్రధానంగా



ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే సృష్టి మొత్తానికి మూలమైనటువంటి ప్రతిజీవి అన్ని జీవులకు ఉపయోగపడుతూ మాత్రమే తమ జీవితానికి అర్హత సంపాదించుకుండేటటువంటి ప్రకృతిలో మనం జీవిస్తూ ఉండేటప్పుడు, మనం కూడా తిరిగి ఆలోచించి మనం ఈ విధంగా అందరికి ఉపయోగ పడుతున్నామా, తక్కిన జీవరాశుల శ్రేయస్సుకు ఉపయోగపడు తున్నామా అని ఆలోచించి జీవించడమే ధర్మము.

అది మరచిపోయి ఒక పావలా బిచ్చగాడి డబ్బాలో వేసి మనం దానం చేసాము, ధర్మం చేసాము అని అనుకోవడం చాలా పొరపాటు. మనమే పెద్ద బిక్ష పాత్ర పట్టుకుని ఉన్నాం. సంచులు, సంచులు ప్రకృతి ధాన్యం పోస్తుంది దాంట్లో, కడవలు కడవలు పాలు పోస్తున్నాయి పశువులు. ఇందులోంచి ఒక పావలా బిక్షగాడికి దానం చేసాను అని అనుకోవడం ఎట్లా కుదురుతుంది. ఏమయ్యా! వాటి కర్మలో ప్రాప్తంలేదు, అందుకని వాటికియ్యా బుద్ధిపుట్టలేదు, నా పుణ్యం బాగుంది కనుక పశుపక్ష్యాదుల ఖర్మ కాలింది కనుక నేనేమి చేయకపోయినా అవి అన్నీ నాకిస్తున్నాయి అని సమర్థించుకుంటే ఏమి ప్రయోజనం. ఇది తెలిసి ఆలోచనతో బ్రతకడాన్ని 'ధర్మం' అన్నారు. కాబట్టి మన సంస్కృతి మీద, మన ధర్మం మీద ఏ మాత్రం అన్నా కొంచెం విశ్వాసం ఉంటే, కొంచెం అన్నా అభిమానం ఉంటే నిన్న తిన్న ఆహారానికి, ఈ రోజు తిన్న ఆహారానికి, రేపు మనం చేస్తున్నది మనసాటివారికి ఎందుకు పనికి వసున్నది అనేది ఒక్కరవ్వ ఆలోచించవలసి ఉంటుంది. అయితే మనం ఏమి చేయగల

మండీ? ఆ! చేద్దామనుకుందాము. ఏమి చేయాలో చెప్పండి అది మనప్రశ్న. అందరికీ చేయాలని ఉంది కాని ఏమి చేద్దాం? ఎవరికి తెలియదు ఏమి చేయ్యాలో. మన ధర్మం గొప్పతనం చెప్పుకుని కాసేపు సంకలెగరేసుకుందామా! దానికి నీ చీట్లపేకాట ఆడుకుంటానికి తేడా ఏమిటి? కోపగించుకోకండి, అది ఒక మధురమైన కాలక్షేపం. ఇది అంతకంటే మధురమైన కాలక్షేపం. అది మనకు పైసాకు పనికివచ్చేది లేదు. ఇది పైసాకు పనికి వచ్చేది లేదు. మన పెద్దల గొప్పదనం తలుచుకున్నంతమాత్రాన రేపటి నుండి గొప్పగా ఉండగలిగితే చెయ్యవచ్చు ఆ పని, రేపటి నుండి గొప్పగా ఉండలేకపోయినా గాని మనక్కూడా వారి గొప్పదనం వచ్చేయాలి అని అనుకుంటే మాత్రం, వారి పరువు మనమెందుకు తీయాలి? తండ్రి కోపంతో "గాడిద కొడక" అని తిట్టాడు కొడుకుని, అప్పుడు రైట్ నాన్న అన్నాడట. వాడెవడో అన్నాడట నిద్రలేచి ఎవరి మొహం చూచుకున్నానో జారి క్రింద పడ్డాను అని. "అద్దం చూచుకున్నావురా!" అన్నాడట మరొకడు. ఒరే! నీ దుంపతెగ గాడిదలొస్తాయిరా అన్నాడు. అందుకేగదా నీవు యిక్కడున్నావు. ఇందులో ఏది సార్ధకం! అందుకని మన పెద్దలు చేసిన ఘనతని తలుచుకుని సంతోషపడవలసిందే కానీ, ఆ సంతోషానికి మనం కూడా అర్హులం కావాలనే ప్రయత్నం మనలో కలగాలి. గాలి కబుర్లతో మనం వృధాచేసుకునేటటు వంటి కొన్ని గంటలను ప్రయోజనకరమైన మాటలను ఒకరితో ఒకరు చెప్పుకోవడం, వినడం అన్నా చేయాలి. కనీసం మనింట్లో నలుగురు పిల్లలకు మనం చెప్పుకుంటాన్కైనా సిద్ధంగా ఉండాలి. పక్కవాళ్ళ పిల్లలకు చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి. మనం



మాత్రం వృధాగా రోజంతా గాలి కబుర్లతో గడుపుకుని, ఋషీగా రోడ్డుమీద తిరిగేసి ధర్మం కోసం మాత్రమే సంకలెగరేస్తామని అంటే ఆ ధర్మానికి మనల్ని చూచి గర్వపడటానికి మతి లేదా? అందుకని కర్తవ్యం గురించి కాస్త దయచేసి ఆలోచించండి. మనం తింటున్నటువంటి ఆహారం ఎన్ని జీవుల కష్టం అందులో కలిసి ఉందో, ఒక్కసారి ఆలోచించండి. ఒక ముద్ద నోట్లోకి వెళ్ళాలంటే ప్రకృతి ఎంత ఎంత చేయవలసి ఉంటుందో ఆలోచించండి. అలా అయినప్పుడు దానికి సరిపడ్డట్లుగా కొంత అయినా మనం చేయగలిగేటట్లుగా ఉండాలి. అంటే మనకున్న విరామ సమయం కొంత, మనకున్న ఆలోచనా శక్తి కొంత, మనకున్న ఆర్ధిక బలం కొంత, మనకున్న శారీరక బలం కొంత, వీటిని కొద్ది భాగం అయినా దానికోసం వినియోగించడం మేదయినా చేస్తున్నామా? చేయటం విధిగా నేర్చుకోవాలి. అట్లాకాని వాడల్లా "దొంగ" అని భగవద్గీత స్పష్టంగా చెప్పింది. యజ్ఞ శిష్టాసనం కాకుండా తన కోసమే తన అవసరం కోసమే తింటూ ఉండే వాడల్లా "దొంగే". వాడు ఏ జీవిని కొట్టక్కర్ల, ఏ జీవిని చంపకర్ల. అందుకని భగవద్గీతలో చెప్పిన కర్మ సిద్ధాంతానికి లోకంలో దాని గురించి అర్ధంలేకుండా మాట్లాడుకునే కర్మ సిద్ధాంతానికి సంబంధమేలేదు. యజ్ఞశిష్టాసనం కానిది తిన్నవాడు పాపి అన్నాడు తప్ప, జంతువుకాలు మీద కొడితే పాపమని చెప్పలా, ఇంకో మనిషిని చితక్కొడితే మాత్రమే పాపమని చెప్పలా, ఏడిశావు... నలుగురికి పనికి వచ్చేవాడిగా బ్రతకని వాడల్లా "పాపి" అన్నారు. ఇందాక చెప్పానే మావాడు ఏపాపము ఎరుగడండి, ఏడిశావురా

కాస్తంత పుణ్యం చేశాడా అన్నాను. విడివిడిగా మాట్లాడుకునే కర్మ వేరు. భగవద్గీతలో చెప్పిన కర్మ మనను కర్మశూరునిగా చేయడానికి పనికి వస్తుంది. అట్లా కాని కర్మ మనలను కర్మహీనునిగా భ్రష్టులుగా చేయడానికి పనికి వస్తుంది.

నాకు చిన్నప్పుడు నాస్తికత్వ దృష్టి కొంత వచ్చింది. ఇందాకా పరిచయంలో చెప్పానే నా ఉపనమనం అప్పుడు మా అన్నగారి కుమారుడు చనిపోవడంతో ఏముంది జీవితం అనిపించింది మనస్సుకు. అప్పట్నున్నించి తీవ్రమైన అన్వేషణలో జిజ్ఞాసతో తిరుగుతూ ఉంటూ కూడా, దీని దుంపతెగ చూడండి మనస్సు ఎలా చేస్తుందో! పరీక్షలప్పుడు మాత్రం వేదాంతం వచ్చేది. నా పరీక్షలు దగ్గరికి వస్తుంటే, నా స్నేహితుడు "పరీక్షలు 15 రోజులలో వస్తున్నాయి చదువుకోరా" అంటే నేను చెప్పాను. ఓరే! మనం పాసవ్వాలనే అదృష్టంగాని ఉంటే నేను చదువుకున్న 5 ప్రశ్నలే వస్తాయి. పాసవ్వాలనే యోగ్యత లేకపోతే మనం 58 ప్రశ్నలు క్షుణ్ణంగా చదువుకున్నా ఆరోజే జ్వరం వచ్చి పడిపోయి యింట్లో వుంటావు. కావట్టి 5 ప్రశ్నలే చదువుతా. పాసయ్యే అదృష్టం ఉంటే పాసవుతా లేకుంటే లేదు. యూనివర్శిటి వారికి నన్ను పాసుచేసే అదృష్టం ఉంటే నేను పాసవుతా, దానికి అదృష్టం లేకపోతే పోతుంది. ఓరి నీ దుంపతెగ ఎంతకాలానికి పాసవుతావురా. అంత విసుగుపుడితే యూనివర్శిటి కోర్సులు మార్చుకుంటుంది. అన్న వేదాంతానికి వచ్చానన్నమాట. అట్లా తక్కిన వేదాంతం అంతా ఇట్లాగె ఉంటుంది.



శ్రీ కృష్ణుడు చెప్పిన వేదాంతం ఎట్లాంటిది అంటే సృష్టి మొత్తం ప్రతి జీవి అన్ని జీవులకు ఉపయోగపడే విధంగా నిర్మింపబడి ఉంది. వీటికి సహకరించడం కోసం బతికితే నీవు ఒక మనిషివి, లేకపోతే నీవు పాపం చేసినవాడివి అవుతున్నావు. ఎవరినో కొడితేనో, తిడితేనో, చంపితేనో, ద్రోహం చేస్తేనో కాదు పాపం అంటే. అన్ని జీవులు విపరీతంగా కష్టపడి సమిష్టిగా మనకు అందచేస్తున్న వాటిని ఏ జీవికి ఏ విధంగానూ పనికిరాని విధంగా మన సమయమంతా వినియోగించి మనం తింటున్నామే, దీనికి ఇన్ని జీవులకు ఋణపడాల్సి వస్తుంది. మీరు ఇంక తలక్రిందులుగా తపస్సు చేసినా, ఎన్ని శాస్త్రాలు అయినా చదవండి, ఎన్ని రుద్రాభిషేకాలైనా చేయండి, ఎన్ని కల్పాలు తిరిగినా మనం ఆ జీవుల రూపాలలో వచ్చి, అపుడు ఆ జీవుల రూపాలలో ఉన్న వాటికి మనం సేవచేసినా కాని మనకు తరింపురాదు. మనం ఎట్లాంటివాళ్ళం అని మన ఎదుటే వాళ్ళు అనుకోవాలి. ఆ ప్రకారం మాట్లాడతాం. నేనేదో సాయంత్రం పూట 6 గంటలకు ఏ సినిమాకో కార్యక్రమం పెట్టుకున్న. ఆ time కి బయటకు వెళ్ళాలి అనిపిస్తుంది. అట్లా బయలుదేర బోతుంటే స్నేహితులు వచ్చారు. అపుడు రండి, రండి సంతోషం అంటూ, నిజానికి నీ దుంపతెగ ఇప్పుడు వచ్చావేమిట్రా అని అర్థం. ఇంకోపూట దొరకలా అని అర్థం. ఈ మర్యాద లెట్లాంటివో అవి కూడా ఇట్లానే ఉంటాయి. అట్లా గడుపుతాము సమయమంతా. అట్లాగాక నాకు తెలియని విషయాన్ని మనం నలుగురం కూర్చుని చదువుకుందాము, తెలుసుకుందాము రండి. నీకున్న విరామ సమయం, నాకున్న విరామ సమయం, అందరికీ

విరామంగా ఉన్న సమయంలో మనం పదిమందిమి ఒక చోట కూర్చుని ఒక విషయాన్ని తెలుసుకుందాం పట్టండి. మనకు తెలియని విషయం అవతలి వాడినుంచైనా మనకు తెలియాలి, వాడికి తెలియని విషయం మనసుంచి అతనికి తెలియాలి. అట్లాగాక వాళ్ళింట్లో ఇట్లా జరిగింది, వీళ్ళింట్లో ఇట్లా జరిగింది, వాడట్లాట, వీడు యిట్లాట అని కబుర్లు చెప్పుకుంటుంటే ఏమయిపోతుంది మన బ్రతుకు! తిన్న ఆహారానికి ఏమని సమాధానం చెబుతాము?

అందుకని మనధర్మం మీద మనకు ఏ మాత్రం అయినా విశ్వాసం ఉంటే మనకిచ్చిన 24 గంటలలో కొద్దిసేపైనా మానసిక వికాశం పొందటం కోసం, మనమేమిటో మనం తెలుసుకోవటం కోసం ప్రయత్నం చేయాలి. ఆ విధంగా మనం తెలుసు కోవటానికి ప్రయత్నం చేస్తే ఇక నుంచి ఆచరణలో పెట్టడానికి అవకాశం ఉంది. అప్పుడు మన కర్తవ్యం ఏమిటో మనకు ఎలా తెలియాలి? మన పెద్దలు మనకి ఏమయితే రూపొందించి మనకు అందించారో అవి అర్థం చేసుకుంటే చాలు. మా పెద్దలు ఇంత గొప్పగా చేశారంటే సరిపోదు, ఎందుకు చేసారో అర్థం చేసుకుంటే మనం చేయగలుగుతాము. ఉదాహరణకు మన ధర్మం చాలా గొప్పది. "మన ధర్మమును చూసి గర్వించండి, చక్కగా గుర్తు పెట్టుకోండి" అని తిరుపతి దేవస్థానం ప్రకటన నుండి, అందరి ద్వారా వింటూనే ఉంటాము. మన ధర్మం గొప్పదయితే ఏమిటి? అని యువకులకు అనుమానం. ఆలోచించండి. నీ నొసట బొట్టు పెట్టుకోవటానికీను, పెట్టుకోక



పోవటానికీనూ, మన ధర్మం గొప్పదనటానికీను ఏమిటి సంబంధం? మనమాలోచించామా? ఆలోచింపచేయించారా? అనుమానమే లేదు. అది చాలాగొప్పది. అని మాత్రమే అనకుండాఉంటే గొప్పలు చెప్పుకుంటే అవతలి వాడంటా డన్నమాట. ఉదాహరణకు అందరము బొట్టు పెట్టుకుంటాము, మామూలుగా ఏ మనిషిని చూచినా రాగము, ద్వేషము, అసూయ ఇట్లాంటి భావములు అన్నీ ఉంటాయి. వీడిట్లాంటివాడు, వాడు అట్లాంటివాడు, వీడు నా మిత్రుపు, వాడు నా శత్రువు అనే రకరకముల భావములుంటాయి. జీవులు కష్టపడి ఆహారం సమకూర్చితే నీకున్న కొద్ది సమయాన్ని పనికిమాలిన ఆలోచనలు చేస్తావు. మానవులందరు సృష్టిలోని జీవరాశులలో ఒక భాగము. సృష్టి గొప్ప మహత్తరమైనటువంటి యజ్ఞం. ఈ యజ్ఞయాగాదులు, సృష్టిని చేసినటువంటి వాడు పరమాత్మ. ఆ పరమాత్మ చేసినటువంటి సృష్టిలో ఒక భాగం మనం, అందరిలోను ఆ పరమాత్మ శక్తియే ఉన్నది అని ఎందుకు గుర్తుకు తెచ్చుకోవు? వాడు కుంటివాడు, కురూపివాడని నిర్లక్ష్యం ఉండ వచ్చుగాని, దానిని గురించి ఆలోచించే నీవు మాత్రం తప్పకుండా అధముడవి. ఎందుకంటే నీవు ఏమి చేశావు తిరిగి. వాడు చేశాడు వాడు తింటున్నాడు. అంతమాత్రాన చేసేవారి సంగతేమిటి? అట్లాకాక అందరిలో ఉండేటటువంటి పరమాత్మ తత్వాన్ని దర్శించడానికి మనం ప్రయత్నం చేస్తే లోపల మనకుండే రాగద్వేషముల వలన వాడు మనకు జ్ఞాపకం వచ్చి ఈ సంగతి మరిపిస్తాడు. నా మిత్రుడు కలిసాడనుకోండి వాడు, నేను బాల్యంలోనో, ఇప్పుడో చేసిన పనులు గుర్తుకురావడం

మూలాన ఇందాకటి విషయం మర్చిపోయి గాలి కబుర్లు చెప్పుకుంటూ గడుపుతాము మేమిద్దరం. నా శత్రువు నాకు కనపడ్డప్పుడు వాడు చేసిన దుర్మార్గాలు, నాకు అవకాశం వస్తే వాడిని ఏమి చేస్తానో అవన్నీ జ్ఞాపకం రావడం మొదలు పెడతాయి. అట్లా గడిచిపోతుంది ఆ కాలం. దరిదాపుల అన్నీ ఈ రకంగానే ఉంటాయి. ఇందులో ఇంక ఏ ఆలోచన రాదు. అట్లాకాక ఎవరిని చూచినా సరే ఈ సృష్టిమొక్క సంపూర్ణత్వం ఇందాక మన మనుకున్న యజ్ఞస్వరూపమయినటువంటి ఈ సృష్టితత్వం జ్ఞాపకం రావాలి. అందరిలో దైవత్వం ఉన్నదన్న విషయము జ్ఞాపకం రావాలి. అట్లా అందరిలో ఆ దైవత్వమే ఉన్నదన్న విషయం మనం గుర్తుపెట్టుకుంటే అప్పుడు మనలో దైవత్వం వికాసం పొందుతుంది అని ఋషులు చెప్పారు. దానిని ఉపయోగించుకోవడానికి మనకు ఇది సౌలభ్యం. మనం పూజ చేసేటప్పుడు ఆ మూర్తికి బొట్టుపెడుతున్నాం, మళ్ళీ మనం పెట్టుకుంటున్నాము. గమనించుకోవలసిన విషయం అన్నమాట ఇది. అంటే ఆ మూర్తి రూపంలో ఏ పరమాత్మ తత్వమైతే నా ఎదుట సంకేతరూపంలో పెట్టబడి ఉందో ఆ పరమాత్మ తత్వమే నా శరీర రూపంలో కూడా ఉన్నది అని జ్ఞాపకం రావడానికి సహకారంగా వాడుకోరా అని అర్థం. ఇది పరమాత్మకు చెందినది. పరమాత్మ నిర్మించినది. పరమాత్మే అన్ని రూపాలలో ఉన్నది. ఇందులో కూడా ఉన్నది. కాబట్టి ఇది పరిశుద్ధమైన రీతిలో దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ఈ "పరిశుద్ధమైన" అనే దానికి చాలా అర్థాలు ఉన్నాయిలెండి. సద్వినియోగం చేసుకోవాలి అని మనం హెచ్చరిక చేసుకుంటానికి పనికివస్తుంది.



అందరినొసట అది పెట్టుకున్నప్పుడు ఎవరిని చూచినాగాని అది మనసుకు జ్ఞాపకం వచ్చేందుకు సహకారం అన్నమాట. నా మొహం చూడగానే 'నేను' ఎవర్నో శత్రువునో, మిత్రునో అనే సంగతి నీకు ఆలోచనరావడానికి ముందు నేనూ నీ లాగానే ఈ యజ్ఞరూపమైన ప్రకృతిలో దైవశక్తితో నిర్మితమైన రూపం అని నీ మొహం నాకు హెచ్చరిక చేస్తుంది. నా మొహం నీకు హెచ్చరిక చేస్తుంది. కోపమొస్తే 'నీ మొహం పోరా' అంటుండ్లా, లేకపోతే 'నీ మొహం పోరా' అంటుంది. అట్లా ఎందుకు రూపొందించినారు అందరిలో పరమాత్మ తత్వం చూచుకుంటానికి, నిరంతరం పరమాత్మను గుర్తుపెట్టుకుంటానికి నొసట పెట్టుకోమన్నారు. ఒకరినొకరు హెచ్చరిక చేసుకోమన్నారు, జ్ఞాపకం పెట్టుకోమన్నారు. ఇట్లా రూపొందించబడ్డాయి ఒక్కొక్కటి మనదాంట్లో. అటువంటి తత్వాన్ని మనం ఆ విధంగా వినియోగించుకోవడంలో ఈ ప్రయోజనం ఉంది అని అందరము తెలుసుకున్నప్పుడు అట్లా వినియోగించుకోవడానికి ప్రయత్నం చేస్తాం. అని తెలియకనే నీకు జుగుప్స పెరగడం ఏమిటి? అట్లాగే ఎర్రని బొట్టు అందరికి సమానం. ఇది రక్తం యొక్క స్వభావం. కష్టసుఖాలు, ధర్మాధర్మాలు, ప్రేమాభిమానాలు వీటన్నిటికున్ను మన రక్తం అంటాం. మన రక్తం పంచుకున్న బిడ్డ, మన రక్తం పంచుకున్న సోదరుడు అని ప్రేమను వల్లిస్తాము మనం. ప్రేమకు, ద్వేషానికి మొదలైన భావాలన్నిటికి రక్తం సంకేతం. సంస్కృతంలో రక్తానికి, రాగమనే దానికి సంబంధం ఉన్నది. అందుకని అందరం ప్రకృతి మాతయొక్క బిడ్డలం కనుక ఒకరి మీద

ఒకరికి ప్రేమ ఉండడం సహజమైన స్థితి. ప్రేమలేకపోవడం మానసికమైన రుగ్మత, రోగము.

చిన్నప్పుడే తల్లి, తండ్రి చనిపోవడం మూలాన కర్మకాలి ఏ అనాథ ఆశ్రమాలలోనో పెరిగే దుస్థితి కలిగితే ప్రేమ, ఆప్యాయత అంటే ఏమిటో తెలియక పోవడంలో అర్థం ఉంది. అట్లా కాక తల్లి, తండ్రి, సోదరులు అందరు హాయిగా బ్రతికి ఉండి వారిలో ఒకర్ని ఏ రీతిగా ప్రేమించలేని దుస్థితి ఉంటే అది మానసిక రోగం తప్ప ఇంకేముంది! వారి ఆప్యాయత తను అర్థం చేసుకోడు. వారి ప్రేమను పొందలేడు. ఆ మాధుర్యాన్ని అనుభవించలేడు. తిరిగి వాడు ఇవ్వలేడు. వాడు 'జీవచ్ఛవం' అన్నమాట. అట్లాకాక మనమందరం కూడా ఒక పరమాత్మ తత్వాన్ని పంచుకున్నాము అని అందరం అందరికి జ్ఞాపకం చేసుకోవడం ద్వారా అందరం అందరిపైనా ఒక అనురక్తి, ప్రేమ కలిగి యుండడం ద్వారా మన జీవితాలను సార్థకం చేసుకుని యజ్ఞమయమయినటువంటి ఈ సృష్టిలో మనం ప్రేమతో పాల్గొనాలి. మన జీవితము మన సాటివారి కోసం ఉపయోగ పడాలి అనే దృష్టి మనలో ఉండే ప్రేమకు సంకేతం కావాలి. ఆ విధంగా మనకు మనము హెచ్చరిక చేసుకోవడానికి అందరిలో ఉండేటటువంటి దత్తరూపంలో ఉండేటటువంటి ఆ తత్వాన్ని మనకు పరమేశ్వరరూపంలో గుర్తుపెట్టుకోవడానికి మనమందరిని బొట్టుపెట్టుకోమన్నారు. అంతేకాని నీ ముఖం కాంతివంతంగా ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఫేస్‌గా ఉండటానికి కాదు. అందుకని ఈ రీతిన మన పెద్దలు ఏర్పరిచిన ప్రతి చిన్న అంశం నుండి మనలో



ఈ ధర్మాన్ని నాటుకుంటూ పోతే మనను తిండిదండగ వాళ్ళుగా కాకుండా ఉండటం కోసం వాళ్ళు తాపత్రయపడ్డారు. వాటి అంతరార్థం తెలియక పోవడం మూలాన అది మాత్రం పెట్టుకున్నా, పెట్టుకోకపోయినా తిండి దండుగ వాళ్ళమే అయ్యాము. పెట్టుకుని మరీ అయ్యాం అదీ మన గొప్పతనం. అందుకని భగవద్గీతను, మన సాంప్రదాయలను చక్కగా వివరించుకునేటటువంటి, అర్థం తెలుసుకునేటటువంటి ప్రసంగాలను, కార్యక్రమాలను అందరం ఏర్పరుచు కోవాలి. నల్గురం కలసి అధ్యయనం చేయాలి. అధ్యయనం చేసిన వాటిని చక్కగా ఒకరు మాట్లాడాలి. ఆవార వ్యర్థమయిన మాటలు తగ్గించుకునే బాధ్యత మనకుండాలి. లేకపోతే ఇంక ఏ విధంగానూ మాట్లడనక్కరలేదు. మనను ఎవరు ప్రత్యేకించి తిట్టనక్కరలేదు. ఎందుకంటే అన్ని తిట్లు మనలో అంతకు ముందే సార్థకమైపోయి ఉంటాయి. ఓరే! పశువా! అని తిట్ట నక్కరలేదు. పశువులు కోర్టుకు వెళ్ళి దావావేస్తాయ్ మనమీద. ఔరా! నాబ్రతుకు ఏమన్నా పనికి రాకుండా పోయిందనుకున్నావా! నాపేరు తిట్టుగా ఎందుకు వాడావు? అని భగవంతుడు ముందు కోర్టులో కేసు వేస్తాయి మనమీద. నిజమే అవి బ్రతికినట్లు మనం బ్రతకగలిగామా? అంతమాత్రం ఉపయోగపడ గల్గామా? అందుకని ఏ తిట్లు మనను తిట్టడానికి ఎవరివల్లా కాదు. ఎందుకంటే ఏ తిట్లు తిట్టలేనటువంటి స్థితిలో మనముంటాము. అందుకని ఈ ధర్మము అనే దాని రూపమేమిటి? మనకు స్పష్టంగా తెలిస్తే అందులో ఈ అర్థ, కామాలు మొత్తము పూర్తిగా యిమిడి ఉంటాయి. ఇందాక

చెప్పిన సూత్రము అనుసరించి అర్ధము మొదలైన విషయాలన్నింటిని కూడ శారీరక సామర్థ్యము, మానసిక సామర్థ్యము, వాక్కు, విరామం మనకు ప్రకృతి ఇచ్చింది. ఆ ఇచ్చిన సామర్థ్యములను అందరి యొక్క శ్రేయస్సుకు వినియోగించేరీతిన మనమెట్లా ఉపయోగపడవచ్చా అని ఆలోచించి అందుకు క్రమబద్ధంగా మన జీవితాన్ని గడపాలి. మనకు తెలియకపోతే తెలుసుకోవాలి. తెలిసిన దానిని తెలియని వాడికి చెబుతూ ఉండాలి. ఈ సంగతిని పెద్దలు ఇదివరకే చెప్పారు.

### "స్వాద్యాయ ప్రవచనాభ్యాం నప్రమది తవ్యం"

అంటే "నీకు తెలియకపోతే తెలిసినవాడి దగ్గరకు వెళ్ళి అధ్యయనం చేసి తెలుసుకోవటంలో కానీ, నీప్రక్కవాడికి తెలియకపోతే నీవు తెలియచెప్పటంలో గాని అశ్రద్ధ చేయకురా!" అన్నారు. ఎందుకంటే ఒకసారి అశ్రద్ధ వచ్చేసరికి వీడికి తెలిసేది లేకుండా పోతుంది, వాడికి తెలిసేది లేకుండా పోతుంది. అపుడు పరిస్థితి ఎట్లా వుంటుందో మనం అర్ధం చేసుకుంటే ఒకసారి తెలిసిపోతుంది. మనకు తెలిసిచావదు ఇంకొకరికి చెప్పటానికి, ఇంకొకరి నుండి తెలుసుకోవటానికేమో బుద్ధి పుట్టదు. మనకు టైము ఉండద్దూ! పేపరు చదువుకోవాలాయే? వారాపత్రిక చదువుకోవాలాయే! క్లబ్బుకు వెళ్ళిరావాలి, సినిమాకు వెళ్ళిరావాలి, రోడ్డుమీద తిరిగి రావాలి. బుర్ర మున్సిపాలిటి బండిలాగ పనికిమాలిన అన్ని వార్తలు పోగుచేసుకుని ఇంటికి రావాలోయే.



బుర్రలో చోటెక్కడిది. మన ధర్మము చూసి చంకలు గుద్దుకోవాలా! అయ్యో రామచంద్రా! అని ఏడుస్తుంటాడు ఆ శ్రీ కృష్ణపరమాత్మ. నా ఖర్మకాలా! నా గీత ఇట్లా పడిఉందా! అని ఏడుస్తున్నాడు అక్కడ కూర్చుని. అందుకని భగవద్గీతాదులను మళ్ళీ అధ్యయనం చేసేముందు వీటి యొక్క ధర్మాన్ని మనం అవగతం చేసుకోవలసి ఉంటుంది. అపుడు కృష్ణపరమాత్మ ఒక్క విషయం చెప్పాడు. మీకు ధర్మం తెలుసుకోవాలని ఉంటే ఈ ధర్మార్ధకామాలు నాలుగు నీకు అర్ధం కావాలని ఉంటే అని ఒక పని చెప్పాడు. మనవాళ్ళు ఆ గీత శతకోటిసార్లు వల్లిస్తారు. కాని ఆయన చెప్పింది మాత్రం చేయరు. మనమేదైనా చెప్పబోతే కృష్ణపరమాత్మ ఇలా చెప్పాడోయ్! అంతకంటే నీకెమన్నా తెలుసా అంటారు. రాముడు ఇలా చెప్పాడు. అంతకన్నా నీకెమన్నా తెలుసా అని అడుగుతారు. నీ దుంపతెగ! ఆయనేమి చెప్పాడో అది చెయ్యి. అది చెయ్యడు. కాని ఆయన చెయ్యమన్నది తప్ప ఇంకేమైనా చేస్తాడు. నీ దుంపతెగ! క్లాసురూములో కొంచెం నోరుమూసుకోరా! అంటే మాట్లాడకూడదు. సైలెన్సు, సైలెన్సు, మాట్లాడితే టీచరుగార్కి కోపం వస్తుంది అని లెక్చరు కొడుతున్నాడట. ఏంటీ నీ దుంపతెగ ఇట్లా అరుస్తావేరా? అంటే నేను మాట్లాడవద్దని చెపుతున్నాగా అంటాడట. అదే రీతిన కృష్ణపరమాత్మ చెప్పినది చేయకుండా ఉండటం, రాముడ్ని పొగిడి ఆయన చెప్పింది చేయకుండా ఉండటం. ఏమిటి మనం చేసే కాలక్షేపం? దానికి కృష్ణపరమాత్మ చెప్పినదేమిటో ఒకసారి చెప్పి ముగిస్తాను. ఆ ఒక్కటి మరచిపోవటం మూలానా భగవద్గీత యొక్క "గీత", మనయొక్క "గీత" ఇట్లాగే ఉంటుంది.

ప్రపంచం అంతా కీర్తించింది. దాన్ని ఏమని, ఇంత అద్భుతమైనటువంటి ఆధ్యాత్మిక గ్రంథం మానవాళికి అందరికి సరిపోయే గ్రంథం ఇంకొకటి లేనే లేదు అని విదేశీ పండితులంతా కీర్తించారు. ఇందులో ఒక మత ప్రసక్తి లేదు. ధర్మప్రసక్తి లేదు. మనిషి యొక్క మనస్సు, వాడిలో ఉండే త్రిగుణాలు వాడు చెయ్యాల్సినటువంటి కర్తవ్యం, చేస్తే వాడికి కల్గే ఆధ్యాత్మిక శ్రేయస్సు అనేటటువంటి ధర్మవివరణ. ఈ జీవిత వివరణ ఉన్నదే, ఎక్కడ ఏ మనిషి ఆచరించుకున్నా పనికి వచ్చే వంటలాంటిది. ఓరే! ఇన్ని నీళ్ళు, ఇన్ని బియ్యం ఒక గిన్నెలో కలిపి స్టవ్ మీద పెడితే ఇంతసేపట్లో అన్నం అవుతుంది అని అన్నామనుకోండి. ఏ జాతివారు వండుకుంటే అన్నం రాదు. ఏ మతస్తులు వండుకుంటే రాదు. ఏ దేశస్తులు వండుకుంటే అన్నం రాదు. అటువంటి అద్భుతమైన సత్యాన్ని చెప్పిన ఆధ్యాత్మిక గ్రంథం ఇది. ఈ ధర్మానికి చెందితే నీవు పనికి వస్తావు లేకపోతే నరకానికి పోతావు అని చెప్పలేదు. ఇందులో చెప్పిన ప్రకారం చేస్తే నీవు బాగుపడతావ్, చేసుకోకపోతే పోతావ్. ఎవ్వరైనా ఎక్కడైనా బాగుపడటానికి కావలసిన సూత్రానిచ్చిన అద్వితీయమైన ఆధ్యాత్మిక గ్రంథం అని లోకమంతా దాన్ని కీర్తిస్తూంటే ఆసేతు హిమాచలం పర్యంతము సంవత్సరం పొడవునా ఎక్కడో అక్కడ గీతాజ్ఞాన యజ్ఞములు, ప్రవచనాలు జరుగుతూ ఉంటే ఒంటికి నూనె రాసుకుని ఒక్క చుక్క అయినా ఒంటికి పట్టకుండా గంగాళాలు, గంగాళాలు నెత్తిమీద నీళ్ళు పోసుకున్నట్లు ఆ భగవద్గీతలో చెప్పిన ఒక్క సూత్రంగాని, ఒక్క ఆచరణగాని రాకుండా మనం అందులో మునిగి తేలగల్గు



తున్నామంటే మన ప్రతిభకు మనమే గీటురాయి. దానిని తెలుసుకుని 'వారు' బాగుపడుతున్నారు. వాళ్ళు సాధనలు ఏమిటో, ఆధ్యాత్మికత ఏమిటో, యోగం ఏమిటో తెలుసుకుంటున్నారు, వాళ్ళు ఆచరిస్తున్నారు. వారు కూడ మన ఆధ్యాత్మికతను గొప్ప అంటున్నారు అని సంతోషపడి పార్టీ చేసుకుని యింటికి వెళ్ళింతరువాత మన కాలక్షేపం మనం చేసుకుంటున్నాము. అందులో కృష్ణపరమాత్మ ఏం చెప్పాడంటే వీటన్నిటి సంగతి ఏమి తెలుసుకోవాలి? ఏం చేయాలి? ఎలా నడుచుకోవాలి అంటే

"తద్విద్ధి ప్రణిపాతేన పరి ప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతితేజ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శిన:"

అని నాలుగవ అధ్యాయంలో 34వ శ్లోకంలో ఒక్క సూత్రం చెప్పాడు. ఆ సూత్రం గనుక మనం పాటిస్తే ఇంక ఏ గ్రంథములు చదువలేకపోయినా, ఇంక ఏమి మనం ఆచరించలేకపోయినా అన్నీ ఆచరించగలుగుతాము. అన్నీ తెలుసుకోగల్గుతాము. అందుకే ఆ శ్లోకంలో చెప్పింది చేయాలి. చూశారూ! నేను పరిక్షకు చదువుతున్నపుడు నాకు వేదాంతంరాలా! అట్లా. కృష్ణపరమాత్మ ఏం చెప్పాడంటే ఎవరు సాక్షాత్తు భగవత్ స్వరూపమో, ఈ వేదాలలో, ఈ ఉపనిషత్తులలో, ఈ బ్రహ్మసూత్రాలలో, ఈ భగవద్గీతలో, ఈ యోగ శాస్త్రములలో వీటన్నింటిలో చెప్పబడిన వాటినన్నిటిని తూ.చ. తప్పకుండా పాటించి సంపూర్ణపురుషుడై అందులో చెప్పబడిన ఫలితాన్ని సంపూర్ణంగా పొంది ఈ మొత్తం

పరమాత్మస్వరూపమని అనుక్షణం మనము వస్తువులు చూచినంత చక్కగా ఎవరైతే చూడగల్గుచున్నాడో, వాడు "తత్వదర్శి" అన్న మాటకర్ధం. తత్వం అంటే బ్రహ్మం. దర్శి అంటే చూడటం. తత్వదర్శి సాక్షాత్తు బ్రహ్మాన్ని దర్శిస్తూ ఉంటాడు. మనకు ఈ గోడ ఎంతబాగా కన్పిస్తున్నదో, మీరు నాకెంత బాగా కనబడుతున్నారో, అంతకంటే స్పష్టంగా తనలోను, బయట, ఎల్లెడల పరమాత్మ తత్వాన్ని ప్రత్యక్షంగా చూస్తూ ఉంటాడు. అట్లాంటి తత్వదర్శి వద్దకెళ్ళు. వారిని శరణుపొందు. వారికి సేవచేయి. వారిని నీ సందేహం తీరేంతవరకు చక్కగా మనసు విప్పి ప్రశ్న వేయి. గుడ్డెద్దు చేలోపడినట్లు వినకు అని చెప్పింది ఆ శ్లోకం. "పరిప్రశ్నేన" నీ సందేహం తీరేదాక హాయిగా అడుగు. శరీరానికి పోషణ ఎట్లాకావాలో, మనసుకు కూడా పోషణ అట్లాకావాలి. శరీరానికి పోషణ ఆహారము. మనసుకు పోషణ విజ్ఞానము. అందుకని సందేహం మిగిలి ఉంటే అప్పటికి ఆకలి మిగిలి ఉన్నట్లే. అర్ధాకలితో విస్తరి ముందునుండి లేవగొట్టి పంపించినట్లే. సంపూర్ణంగా వాడు త్రేన్చాలన్నమాట. తృప్తి అయిందరా! ఇంక ఒక్క ముద్దకూడా లోపలికిపోదు. ఎంతో హాయిగా ఉన్నదని వాడనాలి. అట్లానాకు సంపూర్ణంగా సందేహనివృత్తి అయ్యింది. హాయిగా ఉంది, నీవు చెప్పింది. ఇక సందేహం లేదు అనేటట్లుండాలన్నమాట. ఏమో మనకు అర్ధం కాకపోయినా నిజమే కాబోలు, అంటే నిజం కాకపోవచ్చు అని నీవే చెప్పావు. నిజమే కావచ్చు అన్నావో! ఆ నిజమే తెలిసి మాట్లాడావా నీవేమన్నా? ఆయనెవరో చెప్పారు. ఆయన గొప్పవారు.



ఆయన చెప్పింది నిజం అని ఈ ముక్క నేనంటే ఒక పెద్దలన్నారండీ, పెద్దలచుట్టూ తిరిగానండి నేను. శిరిడికెళ్ళిన తరువాత అక్కడ అనుభవం నషాళానికి అయిన తరువాత పెద్దలంటూ వున్నారు. మహాత్ములంటూవున్నారు. వారిని చూడాలి. ఆయన (సాయిబాబా) సమాధి అయిపోయినారు. బ్రతికున్న ఎవర్నయినా పెద్దలను, మహాత్ములను చూడాలని కాస్త దేశం చుట్టూ తిరిగాను. తిరిగిన తరువాత ఒక 'పెద్ద' దగ్గరకుపోతే ఆయనన్నాడు. ఎందుకు వచ్చావు? ఎవరు నువ్వు? అని అంటే నేన్నన్నాను భరద్వాజనండి, ఫలానాచోట ఉద్యోగం చేస్తున్నానండి, తమర్ని చూద్దామని వచ్చానండి. నన్ను చూడ్డానికి ఏముంది, ఎందుకొచ్చావు? ఓరి నీ దుంపతెగ! నేను 'పెద్ద' నన్న సంగతి నీకు తెలిసిందట్రా. నీవెంత పెద్దవయితే తెలిసింది, నేనెంత పెద్దవాణ్ణి అని. అపుడు నేనే నీ కాళ్ళు పట్టుకోవాలి. నీవు నాదగ్గర కెందుకొచ్చావు? తెలిసీ తెలియని కూతలు కూయబాక అన్నారు. నేను 'పెద్ద అని' నీవెట్లా చెప్పావు. ఇదే ఆయన వేసిన ప్రశ్న. ఇదేంటి ఇట్లా మాట్లాడుతాడు. ఏం బాబు బావున్నావా? ఎందుకిట్లా అనవసరంగా తిరుగుతావు, ఇట్లా ధ్యానం చేసుకో, ఇట్లా చదువుకో, పూజ చేసుకో అని చెప్పడే. ఇదేంటి ఇట్లా తిడతాడేంటి. రాను 25 రూపాయలు ఖర్చు పెట్టావు, పోను 25 రూపాయలు ఖర్చుపెట్టావు. ఈ ఊళ్ళో 25 రూపాయలు ఖర్చు పెట్టావు. అడుక్కుతిన్న వాడికి ఇచ్చినా అంతకంటే మేలుగా ఉండేది. నన్ను చూచావ్, నీకేమి వచ్చింది? అని అడిగారు. చూచావుకదా! నీకేమి వచ్చింది. నీకేమన్నా మతిపోయిందా అని అడిగారు. నాకే అనుమానం వచ్చింది వుందా లేదా అని.

ఏం చెప్పాలి. కాదండీ మీరు పెద్దలు, జ్ఞానులు అని వచ్చానండి. మళ్ళీ అదే మాట అంటే నేను ఎంత పెద్దనో నీకు తెలుసా, నీకెట్లా తెలుసు? అన్నాక చివరకు చెప్పారు. వేలంవెర్రిగా గుడ్డి ఎద్దు చేలో పడ్డట్టు పోవడం అలవాటయ్యింది నాయనా. దాని వల్ల దేశం పాడైపోతుంది. అందుకని పిల్లలు మీరు ఇట్లాంటి పనులు ఎపుడు చెయ్యకూడదు. నీకు నిర్దుష్టంగా ఏమి తెలుసుకోవటం కోసం వెళుతున్నావో నీకు తెలియాలి. ఆయన పెద్ద అయితే ఏంటీ? నీకు తెలియాల్సిన విషయం అక్కడ ఉందా లేదా? నేను ఒక మందుల షాపుకెళ్ళాను. నాకు పలానా జబ్బు వుంది. దానికి కావలసిన మందులున్నాయి. పలానా షాపు చాలా గొప్పది అందులో ఉన్న మందులన్నీ బ్రహ్మాండంగా పనిచేస్తాయి. అని చెబితే, నా జబ్బుకు సరిపోయే మందు అందులో లేకపోతే కొంటావా? నీక్కావలసింది నీ జబ్బుకు మందు, నీక్కావలసింది నీ ఆరోగ్యానికి కావలసిన ఆధారం. నీ దుంపతెగ! నీకేమి కావాలో తెలుసుకుని చావు. దాని గురించి వెళ్ళి వాడిని అడుగు వాడు నీకు చెపుతాడు. లేకపోతే ఎవరి దగ్గరికైనా వెళ్ళండి రేపొద్దున కావాలంటే, నాకేమి తోచట్లేదు ఏదైనా కాసేపు మాట్లాడండి అని అడగండి వచ్చే మాట కాస్త ఆగిపోతుంది. ఆ రోజు జరిగింది కదా! జరిగింది ఏమిటో అడగండి. ఆ సంఘటన గుర్తుంటుంది. ఆ రోజు మీటింగు అయింది కదా! ఆ రోజు మనం అక్కడకు వెళ్ళాంకదా. ఆరోజు నీవు అలా అన్నావు గదా! దాని సంగతి ఏమైందిరా అని అడగండి. చాంతాడు లాగా వద్దనేంతవరకు చెబుతాడు. అట్లాగాక నాకు ఏమి తోచట్లేదు ఏదైనా మాట్లాడడానికి వచ్చాను కాసేపు



మాట్లాడమని చెప్పండి, రేడియో off అయిపోతుంది. ఏమి మాట్లాడాలి? ఏం మాట్లాడమంటావురా? నాకేమి తోచట్లేదు అని అంటాడన్నమాట. కాబట్టి ఏమి అడుగుతావు? అందుకని ఏమి అడగాలో నీకు తెలియాలి ఏమి తెలుసుకోవటానికి వెళ్ళావు నీవు! భయం లేకుండా అడుగు. అయ్యా! మిమ్మల్ని పెద్దలంటున్నారు, మీరు ఎందుకు ఒప్పుకుంటున్నారు, మీలో పెద్దరికం ఏమిటని అడుగు? ఏమి అడిగితే? అయ్యా! నాకు పలాన మందుకావాలి మీ షాపులో ఉందా లేదా అని అడుగుతున్నావు. నీకు పరువు తక్కువనుకుంటే మందు సిద్ధం చేసుకో లేకపోతే లేదని చెప్పు simple. మీ దగ్గర లేకపోతే మీ దగ్గర ఇంత simple మందు కూడా లేదా అని అనుకుంటాం. అంతకన్నా ఏమి చేస్తాం.

అది వివేకానందుడు మనకు నేర్పింది. నీవు చూచావా భగవంతుణ్ణి. ఆ చూచాను. అంటే నాకు చూపించగలవా! అని అడిగాడు. ఆ ప్రశ్నతో వాడు బయలుదేరాడు. అయితే వివేకానందుని ప్రశ్నను పట్టుకుని ఒకప్పుడు నేను కూడ అడిగేవాడిని. ఎవరిదగ్గరకైనా వెళ్ళి నీవు చూచావా భగవంతుడిని. నాకు చూపిస్తావా అని అడుగుదామనుకునే వాడిని. ఒక మహాత్ముడుని అడిగితే అన్నాడు, నీవు వివేకానందుడివై ఆ మాట అడిగితే నేను రామకృష్ణుణ్ణి అయివుంటే చూపిస్తాను. నిజమే ఆ మాట. నేను వివేకానందుడు వేసిన ప్రశ్నను పట్టికెళ్ళి వేసాను కాని వివేకానందుడు ఏ గ్రంధాలు చూచి ఆ ప్రశ్న వేశారు. కాబట్టి నాకు పుట్టిన ప్రశ్న కాదు అది. కాబట్టి నాకెట్టి

సమాధానం వస్తుంది. నీవు వివేకానందుడివైతే నేను వేసిన ప్రశ్నకు ఆన్సర్ వస్తుంది. నీవు వివేకానందుడివి కావు. "అవివేకానందుడువి" అనుమానమే లేదు అందులో. నీ అవివేకమే నీకు ఆనందం. అందుకని అట్లాంటి కూతలు వారిదగ్గర కూస్తే సరిపోదు. ఏడిశావులే పోయిరమ్మంటారు. అరె! ఏమిటండి ఇలా చెపుతున్నారు. మనుషులు కష్టపడుతున్నారు. సుఖపడుతున్నారు. నేనేం చేయాలి? నాకేమి తెలియటం లేదు. నేను ఎట్లా జీవిస్తే బ్రతుకుబావుంటుంది చెప్పండి సార్ అని అడిగితే. నీవు ఎట్లా జీవించాలి అని అడిగావు కనుక ఎట్లా జీవించాలో చెబుతారు. నీకు ఏంకావాలని అక్కడకు వెళ్ళావు, ఏం కావాలో తెలియకుండా వెళితే ఉట్టి చేతులతో తిరిగి వస్తావు. "పరిప్రశ్నేన సేవయా" పరిప్రశ్న ఉంటే నీకు జ్ఞానం ఉపదేశించబడుతుంది. శరణు పొందుతావు. ఆశ్రయం ఇవ్వబడుతుంది. మహాత్ములను శరణుపొందు అన్నాడు. శరణు పొందటం అంటే చాపచుట్టల్లా కాళ్ళమీద పడటమా! ఎట్టా పడిందో అలా లేస్తుంది. మళ్ళీ పడదామా! శరణు ఏమి పెట్టి చేస్తావు. నిన్ను నీవు అర్పించుకుంటావా? వస్తువు అయితే ఎవరికన్నా ఇవ్వవచ్చు. నిన్ను నీవు ఎట్లా అర్పించుకుంటావు? దేంతో పట్టుకుంటావు నిన్ను, అక్కడ అట్లా ఉంచేసిన తర్వాత నీ చేతులు వెనక్కి వెళతాయా, వెళ్ళవా? మళ్ళీ మీ ఊరు వెళతావా, వెళ్ళవా! అప్పుడు ఏమి ఇచ్చి వచ్చావు. నేను చెబుతుంటాను లెండి. "నా సర్వస్వం నీకిచ్చేస్తానని". అసలు నాకేమన్నా వుంటేగా ఇవ్వటానికి. నన్ను నీవు మేపాల్సివస్తుందని అర్థం ఆ మాటకు.



నా టిఫిన్, కాఫీ కూడా నీవే పెట్టుకోవాలని అర్థం. వాడికి ఆ సంగతి ఏమి తెలుసు? పందెంలో ఓడిపోతే తనదంతా ఇస్తానన్నాడంట. వాడి వెనకాల అప్పులున్నాయి బోలుడంత. అవి ఇస్తామని అర్థం. అందుకని ఆ మహనీయుల వద్దకు పోతే ఏమి అడగాలో తెలియాలి. సిగ్గు తేల్చుకునేటటువంటి స్థితి ఉండాలి. ఆ స్థితే వచ్చింతరువాత అవతల భీష్ముడు ఉండచ్చు, ఇవతలవాడు అర్జునుడు ఉండచ్చు. యుద్ధరంగంలో దిగిన తరువాత యుద్ధమే. నీ సామర్థ్యం నీవు చూపించు. నా సామర్థ్యం నేను చూపిస్తా. యుద్ధంలో నన్ను పూర్తి పరాజితుడని చేసావా! అపుడు సాష్టాంగపడి శరణుపొందడం తప్ప నేను చేయకల్గింది ఏముంది. అట్టా శరణు పొందించుకుంటాడు. అది "తత్వదర్శనం". తన మహిమను చూపించి, ఎటూ దారి లేకుండా మన కన్ను దాటేసిన తరువాత "నీవే శరణు" అని లోపల నుండి కేక పుట్టుకొస్తుంది. అంతే తప్ప మర్యాదగా ఉత్తరీయం నలగకుండా చొక్కా నలగకుండా, ప్యాంటు నలగకుండా హాయిగా శరణు పొందాలని వచ్చి can I sit here (నేను ఇక్కడ కూర్చోవచ్చా) అని అడిగినట్లుంటుంది. Get out, బయటకు పో అంటాడు. అందుకని వాళ్ళను శరణుపొందడం అంటే "అకస్మాత్తుగా పులి ఎదురుగా ఉంటే ఏమవుతుందో అదన్నమాట". శరణు పొందడమంటే తను నిద్ర లేచేటప్పటికి వాడి ముఖం మీద పులి ముఖం పెట్టి చూస్తుంటే అపుడు ఏమవుతుందో అదన్నమాట. గురువు యొక్క మహత్యం చూచిన తరువాత ప్రాణం అట్లా వుంటుంది. నీ దుంపతెగ! ఓరి భగవంతుడా! నీవు ఇదివరకు లేకపోతే లేకున్నామానేయ్.

ఇపుడన్నా ఉండి నన్ను కాస్తబయట పడేయి అంటాడన్నమాట. అట్లా ఉంటుంది శరణాగతి అంటే. అట్లాంటి మహనీయుని దగ్గరకు వెళ్ళు. ఆ మహనీయుని దగ్గరికి వెళితే నీవు శరణు పొందడమే జరుగుతుంది. అపుడు జంకక తల్లిని బిడ్డ అడిగినట్లు నీకు కావలిసిందేమిటో, తెలుసుకోవలసింది ఏమిటో నీవు అడిగి తెలుసుకో సర్వము తెలియబడుతుండి అని కృష్ణపరమాత్మ భగవద్గీత శ్లోకంలో చెప్పాడు. ఆ శ్లోకం 'గీత' పుట్టుకను తెలుపుతుంది. అర్జునుడు తెలుసుకున్న ధర్మాలన్నీ ఎగిరిపోయి ధర్మ సమ్మూఢచేతస్కుడైవున్న సమయంలో శ్రీ కృష్ణుని పాదములపై బడి నాకేమి తెలియటం లేదు. దయతో నా కర్తవ్యముని భోదించు అని ప్రార్థించాడు.

పరీక్షలలో కొంతమంది పేపరు చూడగానే అన్నీ మర్చిపోతారు అట్లా అన్నమాట. తక్కినపుడు అంతా గుర్తుపెట్టుకుంటాడు. క్షుణ్ణంగా చెపుతారు. హాల్లోకి వెళ్ళేముందు కూడా చెబుతాడన్నమాట. హాల్లోకి వెళ్ళిన తరువాత మొదటి వాక్యం గుర్తుకు రాదు. మొదటి వాక్యం గుర్తుకు వస్తే చాంతాడులా వెళ్ళి పోతుంది. మొదటి వాక్యం గుర్తుకు రాదు. ఆ రకంగా brain పని చేయకుండాపోయి ఏమి తెలియని వాడయ్యాడు. అయినా కాని ఒక్కటి మాత్రం వాడికి తెలిసింది. "నాకేం తెలియకుండా పోయింది నీవేమన్నా చెప్పు" అన్నాడు. నేనేం చేయాలి చెప్పు అన్నాడు. అటు చూస్తే అది ధర్మం అనిపిస్తుందే. ఇటు చూస్తే ఇది ధర్మం అనిపిస్తుందే నేనేం చేయాలి మరి అని అడిగాడు. అపుడు "నేను చెబుతాను" విను



అని చెప్పాడు. అది ధర్మం ఎందుకో అని నిర్ణయించుకోవడానికి కావలసిన మొత్తం చెప్తాడు. సకల శాస్త్రాల యొక్క సారాన్ని మొత్తం చెప్పాడు. కాని అర్జునుడు అంతకు ముందు ఒక్క ధర్మం తెలియని వాడైతే మాత్రం కృష్ణపరమాత్మ దగ్గరకు వెళ్ళి అడిగితే చెప్పేవాడు కదా! అప్పుడు తక్కిన శాస్త్రాధ్యయనం ఏమి లేకపోయినా సరే ఆ శ్లోకంలో చెప్పిన ఒక్కమాట, ఆ ఒక్క పని చేస్తే, ఆ భగవద్గీతలో చెప్పబడిన సారాంశం మొత్తం చెప్పి ఉండేవాడు. అందులో చెప్పబడినవి "సకల ఉపనిషత్తుల, వేదాల, బ్రహ్మాసూత్రాల సారాంశము" అందుకని మనకు రాదే, చదవలేదే, మనకు తెలియలేదే అనుకోవాల్సిన పనిలేదు. **మహాత్ముల వద్దకు వెళ్ళి శరణు పొందు నీకు చెబుతారు.**

* * *

## * మాస్టరు గారి రచనలో నుండి కొన్ని విషయాలు *

1. అందరిలో అన్నింటిలో సాయిని చూడటం కేవలం బేధభావాలు కలిగే పరిస్థితులొచ్చినపుడే గుర్తించుటకు ప్రయత్నించటం కాక అనుక్షణం కేవలం శ్రద్ధ అనేది నిరంతరం ఉండవలసిన జాగ్రత్త పనిగట్టుకుని దృష్టి పడేవన్నీ సాయి రూపాలే అనే గుర్తు నిలుపుకోవాలి **(నిష్ఠ)**.
2. అలా నిష్ఠ నిలపటంలో వచ్చే (అడ్డంకులు, మరపులను) వ్యతిరేక భావాలను సాయి బోధించిన సత్యాలను గుర్తుతెచ్చుకుని వ్యతిరేక భావం కల్గినప్పుడల్లా సరైన భావాన్ని దానిపై రుద్దాలి. కొన్నాళ్ళకు వ్యతిరేక భావం పోయి సహజంగా సరైన భావాన్ని వహించటం జరుగుతుంది **(సబూరి)**.
3. దీనికై ఎప్పుడు ఏ సాధన ప్రేరేపించి చేయిస్తున్నా, ఆ సాధన ద్వారా నిష్ఠ, సబూరిలను పొందుటే ధ్యేయమని గుర్తుంచుకొనుటకై రోజు ఒక నిర్ణీత సమయంలో మన నిష్ఠ, సబూరిలను మననం చేసుకోవాలి.
4. ఇవి కుదురుటకు తీసుకోవలసిన జాగ్రత్తలలో ఒక అతి ముఖ్యమైనది వాక్కును నియమించటం. ఆ మాట మాట్లాడకుంటే నష్టం లేదు అనేవన్నీ మాట్లాడకుండటం. దైవము, కర్తవ్యము, ధర్మముల గూర్చి మాత్రమే మాట్లాడటం.
5. నిరంహంకారం సహజ సిద్ధం అవుటకు ప్రయత్నంగా నిష్ఠ, సబూరిలను, వాక్యజ్ఞాన్ని సల్పుతూ ఇతరుల ఎదుట మన సద్గురు కృప లేక కర్మ ప్రకారంచే జరిగిన మంచి పనులు మనం పొందిన గొప్ప, సాధ్యమైనంత వరకు ప్రకటించు కోకుండటం.
6. హారతులు, సత్సంగం అన్నీ లౌకిక క్రియలలో జగత్తుతో సంబంధం లేకుండా చేయటం కాక హారతిలో "నీ చరణ ధూళిగాను నను చేయుము" మొదలగునవి వచ్చేటప్పుడు చుట్టు ప్రక్కల అందరి హృదయాలలోని సాయినాధుని గుర్తించి వారితో ప్రార్ధిస్తున్నట్లు అలా చేస్తుంటే అందరిలో బాబాను చూడటం సులభమవుతుంది.
7. మననం వల్ల మాత్రమే సాయినాధుడు చెప్పినవి మన మనస్సుకు బాగా పట్టి ఆనందంగా ఉంటుంది. అలా ఆధ్యాత్మిక ద్వారా ఆనందం బాగా పొందటం అలవాటు అయితే తప్ప ఇతర వ్యామోహాల నుండి బయట పడలేము.



అందరిలో సాయిని చూడటం అభ్యాసం చేయాలి. వాక్యజ్ఞం చేస్తే మనలో శక్తి పెరుగుతుంది. అట్టి నడవడిలో, విమర్శించిన వాడిలో సాయి ఉన్నారన్న భావన కల్గియుంటే అహంకారము తగ్గిపోతుంది. వ్యర్థంగా మాట్లాడటం తగ్గించుకోవాలి.

తిట్టేవాడిలో సాయియే ఉండి మనలోని కర్మక్షయం చేయడానికే చేస్తున్నారన్న భావన కల్గియుంటే చాలు. దైవాజ్ఞ లేక ఏమియు జరుగదన్న విశ్వాసం కలియుండాలి.

నీవు ప్రయత్నం చేయడం ఒక్కటే చేయవలసినది కర్తవ్యము, ధర్మము, దైవం కొరకే చింతించాలని నియమం పెట్టుకోవాలి.

* * *